సాక్షి ఏలూరు

శుక్రవారం । 31 । జనవరి । 2025



కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు ఏలూరు డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. 8లో ▸



కోడిపందేల శిబిరంపై దాడి

అధికారం అండగా మునునూరు మండలం లోపూడిలో అర్ధరాత్రి యథేచ్ఛగా నిర్వహిస్తున్న భారీ కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. 8లో ▸



మఠంగూడెంలో దారుణ హత్య

అనుమానం పెనుభూతమై భార్యను భర్త కిరాతకంగా హతమార్చిన ఘటన లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. 8లో ▸

త్రిపుల్‌ఐటీ.. మంత్రి దోపిడీకి అడ్డా!

- తన అనుయాయులకే వ్యాపారాల నిర్వహణ
- టీఎల్‌ఎఫ్ పేరుతో 11 షాపులను కట్టబెట్టిన వైనం
- నాణ్యత, ధరలపై ప్రశ్నిస్తే విద్యార్థులకు బెదిరింపులు



నూజివీడు ట్రిపుల్ ఐటీలోని ఫుడ్ కోర్టు

సాక్షి టాస్క్‌ఫోర్స్: నూజివీడు ట్రిపుల్ ఐటీలోని ఫుడ్ కోర్టు, ఫ్యాన్సీ షాపుల ఏర్పాటు వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ప్రతి నెలా అద్దె రూపంలో ట్రిపుల్ ఐటీకి లక్షలాది రూపాయల ఆదాయం వచ్చే ఫుడ్ కోర్టు, ఫ్యాన్సీ షాపులపై మంత్రి కన్నుపడింది. అంతే.. వాటిని తమ వారికి కట్టబెట్టేశారు. దీనికి గాను మధ్యలో మెప్మాకు చెందిన టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎల్‌ఎఫ్)ను వాడేసుకున్నారు. మెప్మా పేరును వాడుకున్నందుకు గాను వారికి లాభంలో 0.5 శాతం కమీషన్ ఇచ్చేలా ప్రైవేటు ఒప్పందాలు చేసుకుని ట్రిపుల్ ఐటీని దోపిడీకి అడ్డాగా మార్చేశారు.

ఒక్కొక్కటిగా పావులు కదుపుతూ..

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఫుడ్ కోర్టుతో పాటు రెండు ఫ్యాన్సీ షాపులు గతంలో నడిచేవి. వీటికి అద్దె నిర్ణయించి ఎక్కువ రేటుకు టెండరు వేసినవారికి కేటాయించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నూజివీడు ట్రిపుల్ ఐటీలోని ఫుడ్ కోర్టు, ఇతర షాపులపై రాష్ట్రంలోని ఓ మంత్రి కన్ను పడింది. ఇక్కడ ఎనిమిది వేల మంది విద్యార్థులు ఉండటంతో తన వాళ్లకు దోచిపెట్టొచ్చని, ఒక్కొక్కటిగా పావులు కదుపుతూ పలుమార్లు ట్రిపుల్ ఐటీని సందర్శిస్తూ వచ్చారు. దీనిలో భాగంగా ఫుడ్ కోర్టును తనిఖీ చేసి అంతా నాసిరకంగా ఉందంటూ ఉన్నతాధికారులతో నివేదికలు సిద్ధం చేయించి అప్పటివరకు ఫుడ్ కోర్టును నడుపుతున్న సంస్థను తప్పించారు.

టీఎల్‌ఎఫ్‌కు ఇవ్వాలంటూ సిఫార్సులు

ట్రిపుల్ ఐటీలో ఫుడ్ కోర్టుతో పాటు బాలికల హాస్టల్‌లో మరో ఫుడ్ కోర్టు, నాలుగు ఫ్యాన్సీ షాపులు, రెండు జిరాక్స్ షాపులు, రెండు సెలూన్ షాపులు, ఒక పార్లర్‌ను డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అంటూ మెప్మా పరిధిలోని టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎఫ్‌ఎల్)కు 11 షాపులను కేటాయించారు.

తన మనుషులకు అప్పగింత

టీఎల్‌ఎఫ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఫుడ్‌కోర్టులు, ఫ్యాన్సీ షాపులు, జిరాక్స్ సెంటర్లు, సెలూన్లు, పార్లర్‌ను మంత్రి తన మనుషులకు అప్పగించేశారు. ట్రిపుల్ ఐటీ అధికారులు టీఎల్‌ఎఫ్‌తో ఒప్పందం కుదుర్చుకోగానే, తిరిగి టీఎల్‌ఎఫ్.. మంత్రి మనుషులతో ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం.

ఆ జీఓ వీటికి ఎలా వర్తిస్తుంది?

ప్రభుత్వ కార్యాలయాలను అద్దె భవనంలో ఏర్పాటుచేయాల్సి వచ్చినప్పుడు చదరపు అడుగుకు రూ.6 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ట్రిపుల్‌ఐటీలో వ్యాపారాలు చేసుకుంటున్న వారికి కూడా అదే పద్ధతిలో రూ.6 చొప్పున నిర్ణయించి అద్దెకు ఎలా ఇస్తారనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అసలు ప్రభుత్వ భవనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఎలా ఇస్తారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నామమాత్రపు అద్దెకు..

ఫుడ్ కోర్టులకు, ఫ్యాన్సీ షాపులను నామమాత్రపు అద్దెకు కట్టబెట్టేశారు. గతంలో ఫుడ్ కోర్టుకు నెలకు రూ.5.94 లక్షలు రాగా, ఇప్పుడు కేవలం రూ.42,600కు అప్పగించారు. బాలికల హాస్టల్‌లోని ఫుడ్ కోర్టును రూ.18,900కు, ఐ1 బాలుర హాస్టల్‌లోని ఫ్యాన్సీ షాపునకు గతంలో రూ.36,008 అద్దె రాగా ఇప్పుడు రూ.3,486కు, బాలికల హాస్టల్‌లోని ఫ్యాన్సీ షాపులకు ఒక్కో దానికి గతంలో నెలకు రూ.22 వేల నుంచి రూ.44 వేల వరకు అద్దె వచ్చేది. ఇప్పుడు మాత్రం ఒక్కోదానికి రూ.3,486 మాత్రమే నిర్ణయించి కట్టబెట్టారు.

స్థానిక నాయకులకు నో..

ట్రిపుల్‌ఐటీలో షాపులను నియోజకవర్గానికి సంబంధం లేని పెనమలూరు, ఉయ్యూరు తదితర ప్రాంతాల వ్యక్తులకు ఇవ్వడంతో తమకు కూడా ఏదైనా షాపు ఇవ్వమని కొందరు స్థానిక టీడీపీ నాయకులు అడిగితే నో అని మంత్రి సమాధానం చెప్పినట్టు టీడీపీ వర్గాల్లోనే చర్చించుకుంటున్నారు.

మేం మంత్రి గారి తాలూకా

ట్రిపుల్‌ఐటీలోని ఫుడ్‌కోర్టులో ధరలు ఎక్కువగా ఉన్నా, పదార్థాల నాణ్యతగా లేకపోయినా, రుచిగా లేకపోయినా ఇదేంటని అడిగితే తాము మంత్రి గారి తాలూకా అంటూ విద్యార్థులను బెదిరిస్తుండటం గమనార్హం. కొందరు బాలికలకు కడుపులో నొప్పి వచ్చిందనే సాకుతో ట్రిపుల్‌ఐటీ అధికారులు బయటి నుంచి ఫుడ్ తెచ్చుకోవడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేశారు. ఇదే అదునుగా ఫుడ్ కోర్టుల్లో, ఫ్యాన్సీ షాపుల్లో అధిక ధరలకు విక్రయించి విద్యార్థులను దండుకుంటున్నారు.

బాలరాజుకు ఫోన్‌లో జగన్ పరామర్శ



మాజీ ఎమ్మెల్యే బాలరాజును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుట్టాయగూడెం: పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సాయంత్రం ఫోన్‌లో పరామర్శించారు. బాలరాజు తల్లి మల్లమ్మ మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే ఫోన్ ట్రై చేశానని అన్నారు. త్వరలో విజయవాడ వచ్చిన తర్వాత కలుస్తానని జగన్ అన్నారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నాయకుల నివాళులు : బాలరాజును గురువారం వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు. బాలరాజు తల్లి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే వాసుబాబు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయరాజు, ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేసి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెర్సు చిరంజీవి, ఏలూరు నగర బీసీ సెల్ ప్రెసిడెంట్ కిలాడి దుర్గారావు, జిల్లా అధికార ప్రతినిధి జాన్ గురునాథ్, సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్, కాకర్ల సురేష్ తదితరులు పరామర్శించారు.

న్యూస్‌రీల్

రథసప్తమి ఉత్సవాలు ప్రారంభం



చంద్రప్రభ వాహనంపై స్వామివారు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి రథసప్తమి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి 7 గంటలకు స్వామివారు పెళ్లి కుమారుడు అలంకరణలో చంద్రప్రభ వాహనంపై కొలువుదీరగా గ్రామోత్సవం నిర్వహించారు. విజయవాడకు చెందిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈఓ సాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి ఆలయ ధర్మకర్త, నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో నిత్య కల్యాణం జరిపించారు. ప్రతాప్ అప్పారావు పట్టువస్త్రాలు సమర్పించి ఉభయ దా తగా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియామావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆమె ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని డీఆర్వోలు, ఆర్డీఓలు, అధికారులతో సమీక్షించారు. వెయ్యికి పైగా ఓటర్లు ఉంటే మరో పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలను ఈనెల 31న సమర్పించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రి సరఫరా, పోస్టల్ బ్యాలెట్, మోడల్ కోడ్‌పై వివరించారు. కోడ్ అమలులోకి వచ్చినందున ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు, నేతలకు సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, వాల్‌పోస్టర్లను తొలగించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహణ, లౌడ్ స్పీకర్లకు అనుమతులు తప్పనిసరి అన్నారు. తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలించాలన్నారు. ఓటరు దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఏలూరు డీఆర్వో వి.విశ్వేశ్వరరావు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, సందేహాలు ఉంటే సంప్రదించవచ్చని చెప్పారు.

అవి పులి కూనలు కాదు



అడవి పిల్లి కూన

ఆగిరిపల్లి: మండలంలోని కృష్ణవరంలో ఫణి అనే రైతు పొగాకు తోటలో కనిపించిన పిల్లలు పులి కూనలు కాదని, అడవి పిల్లి కూనలను అటవీ శాఖ సిబ్బంది నిర్ధారించారు. గురువారం ఉదయం ఫణి తోటకు నీరు పెడుతుండగా వీటిని గుర్తించారు. గ్రామస్తులకు చెప్పడంతో వీటిని చూసి పులి పిల్లలను భావించి ఆందోళన చెందారు. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ బాల ఇక్కడకు వచ్చి అవి అడవి పిల్లి కూనలుగా నిర్ధారించారు. అడవి పిల్లి శరీరం మీద చారలు భిన్నంగా ఉంటాయని, వాటికి పొడవైన తోక ఉంటుంది అని బాల తెలిపారు. కొన్నిరోజుల క్రితం ఈ ప్రాంతానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత ఉచ్చులో చిక్కుకుని చనిపోయింది. ఇటీవల మేకల మందపై పులి దాడి చేసింది. ఈ సంఘటనల నేపథ్యంలో సగ్గూరు, కృష్ణవరం, సురవరం, కొమ్మూరు గ్రామాల ప్రజలు అడవి పిల్ల పిల్లలను పులి కూనలు భావించి ఆందోళన చెందారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరులో ఈనెల 22 నుంచి జరుగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు సిద్దార్థ క్వెస్ట్ కేంద్రంలో 180 మందికి 138 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 100 మందికి 70 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 118 మందికి 107 మంది హాజరయ్యారు. మొత్తంగా పరీక్షలకు 3,497 మందికి 3,348 మంది హాజరయ్యారు. కన్వీనర్ సాయి కుమారి శంకర్ పర్యవేక్షించారు.

చింతమనేనీ.. ఇదేం పని!



ఏలూరు త్రీటౌన్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న జనసేన నాయకులు

- జనసేన నేతపై చింతమనేని అనుచరుల దాడి
- దుగ్గిరాలలో చెరుకు లోడును అడ్డుకుంటున్న వైనం
- ఏలూరులో పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల ధర్నా

సాక్షి ప్రతినిధి, ఏలూరు: చింతమనేని అనుచరులు మళ్లీ రెచ్చిపోయారు. ఈసారి జనసేన శ్రేణులపై దాడికి దిగారు. బాధితులు స్టేషన్‌కు వచ్చి కేసు పెట్టినా పోలీసులు పట్టించుకోకపోవడంతో జనసేన నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుటే ధర్నాకు దిగడం చర్చనీయాంశంగా మారింది. దెందులూరు నియోజకవర్గంలో జనసేన మండల అధ్యక్షుడికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మర్రి శివరామకృష్ణ, బాధితుడు నూజివీడు మండల జనసేన అధ్యక్షుడు యర్రంశెట్టి రాము, నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. స్టేషన్ బయట గేటు వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు.

నూజివీడు మండల అధ్యక్షుడిపై దాడి

మీర్జాపురం గ్రామానికి చెందిన రాము దెందులూరు నియోజకవర్గంలోని దుగ్గిరాలలో చెరుకు తోట సాగు చేస్తున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో ఈ ప్రాంతంలోని సుమారు 100 ఎకరాలు నీటమునగుతుంది. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వటంతో ఇవి చెరువు భూములు కాదనీ, పట్టా భూములను నిర్ధారించారని బాధితుడు రాము చెబుతున్నారు. తాను నాలుగు ఎకరాల్లో చెరుకు వేశాననీ, సుమారు రూ.6 లక్షలు ఖర్చు చేశానని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తనపై వేధింపులు పెచ్చుమీరాయని, తనపై చింతమనేని ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించారని వాపోయారు. ఐదు నెలలుగా తాను పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. మంత్రి లోకేష్ ప్రజాదర్బార్‌లోనూ రైతుల ఇబ్బందులపై వినతి చేశామనీ, ఏలూరు కలెక్టర్‌కు సైతం తమ సమస్యలు చెప్పామన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 28న తాను తోటలో చెరుకు నరికించి లోడు చేస్తుండగా ఎమ్మెల్యే చింతమనేని అనుచరులు 50 మంది తనపై దాడి చేస్తూ అత్యంత దారుణంగా దుర్భాషలాడుతూ రెండు సెల్‌ఫోన్లు లాక్కున్నారని వాపోయారు. వీఆర్వో సమక్షంలోనే తనపై దాడి చేయటం దారుణమన్నారు.

ఎమ్మెల్యేలకు అహంకారం పెరిగింది

ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికార ప్రతినిధి మర్రి శివరామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చింతమనేని అరాచకాలు పెరిగిపోయాయనీ, చింతమనేనికి సంబంధం లేకుండా ఆయన అనుచరులు చెరుకు తోటలోకి వెళ్లి ఎందుకు దాడి చేశారో చెప్పాలని అన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు కొందరికి గర్వం తలకెక్కిందనీ, అహంకారం పెరిగి అరాచకాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇలానే దాడులు, దౌర్జన్యాలు చేస్తే ఊరుకోబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతామని, వెంటనే కేసు నమోదు చేసి చింతమనేని అనుచరులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇంత నమ్మక ద్రోహమా చంద్రబాబూ

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: సంపద సృష్టిస్తా.. వచ్చిన డబ్బులన్నీ పేదలకు పంచుతా.. సూపర్ సిక్స్ హామీలన్నీ పక్కాగా అమలు చేసి చూపిస్తా.. అంటూ ఎన్నికల హామీలతో కనికట్టు, ఇంద్రజాలం చేసి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు.. రాష్ట్ర ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిన ది గ్రేట్ మోసగాడు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) విమర్శించారు. ఏలూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చలేమని, సంక్షేమ పథకాలు ఇవ్వలేమని నిస్సిగ్గుగా ప్రజలను దగా చేశారని విమర్శించారు. ఆనాడే ఎన్నికల ప్రచారంలో మాజీ సీఎం జగన్ ఈ విషయం చెప్పారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడు నెలల కాలంలో సీఎం చంద్రబాబు రూ.1.19 లక్షల కోట్లు అప్పులు చేశారనీ, ఈ అప్పులతో ఎక్కడ సంపద సృష్టించారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఒక్క కొత్త ఉద్యోగం ఇవ్వకుండా.. ఉన్న ఉద్యోగాలనే తీసేసిన ఘనుడు బాబు అని ఎద్దేవాచేశారు. జగన్ హయాంలో తీసుకువచ్చిన పోర్టులు, హార్బర్లు, మెడికల్ కాలేజీలను చంద్రబాబు అనుయాయులకు తెగనమ్మే ప్రయత్నాలు చేయటం నిజం కాదా? అంటూ నిలదీశారు.

ప్రశ్నించేందుకు ప్రజలు సిద్ధం

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో రెండు, మూడు సినిమాలు తీస్తే.. వారికి నజరానాగా వందల ఎకరాలు దోచిపెడుతున్నారనీ, ఇదేనా మీ సంపద సృష్టి అని డీఎన్నార్ అన్నారు. హామీల అమలుపై మంత్రి లోకేష్‌నూ ప్రశ్నించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కరోనా విపత్తు సమయంలోనూ నాటి సీఎం జగన్ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్రం శ్రీలంక అయ్యిందంటూ ఎల్లో మీడియా విషప్రచారం చేసిందని మండిపడ్డారు.

సూపర్‌సిక్స్ గాలిలో కలిసిపోయింది

ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సూపర్‌సిక్స్ హామీలు గాల్లో కలిసిపోయాయని ఎద్దేవా చేశారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసి, విజన్ ఉన్న నాయకుడిగా చెప్పుకుంటూ మరో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటూ ప్రజలను నిలువునా మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, యువత ఇలా అన్నివర్గాల ప్రజలు పథకాలు అమలు చేస్తారని ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, ఆసరా, చేయూత లాంటి పథకాలన్నీ ఎక్కడ అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. నాయకులు నూకపెయ్యి సుధీర్‌బాబు, దాసరి రమేష్, యువజన విభాగం నగర అధ్యక్షుడు గంటా సాయి పాల్గొన్నారు.

కోడ్ కూసింది



విగ్రహానికి ముసుగులు వేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియామవళి అమలులోకి రావడంతో ఎంపీడీఓ రాజ్ మనోజ్ ఆదేశాలతో పంచాయతీ అధికారుల కోడ్ అమలుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. మండలంలో 120కి పైగా ఫ్లెక్సీలను తొలగించారు. 44 విగ్రహాలకు ముసుగులు వేశారు.

అగ్నిమాపక శకటం కేటాయింపు

సాక్షి స్పందన

భీమడోలు: భీమడోలు అగ్నిమాపక కేంద్రానికి ఉన్నతాధికారులు అగ్నిమాపక శకటాన్ని కేటాయించారు. ఈనెల 24న 'మూలనపడ్డ అగ్నిమాపక శకటం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఏలూరు అగ్నిమాపక కేంద్రం నుంచి తాత్కాలికంగా శకటాన్ని భీమడోలు ఫైర్‌స్టేషన్‌కు కేటాయించారు.



భీమడోలులో అగ్నిమాపక శకటం

చెత్త రిక్షాలకు మరమ్మతులు

కైకలూరు: 'స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలకు తూట్లు' శీర్షికను ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పాత ఎంపీడీఓ క్వార్టర్స్ వద్ద పడి ఉన్న చెత్త సేకరణ రిక్షాలకు గురువారం మరమ్మతులు చేయించారు. ఆరు రిక్షాలను చెత్త సేకరణకు వినియోగిస్తామని ఆటపాక సర్పంచ్ తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగి మాయాజాలం

- మిషన్ వాత్సల్య ఉద్యోగాల భర్తీలో చేతివాటం
- కాసులు తీసుకుని పోస్టింగ్ ఇచ్చేందుకు పావులు
- ఉన్నతస్థాయి విచారణకు అభ్యర్థుల డిమాండ్



ఏలూరులో జిల్లా మహిళాభివృద్ధి సంస్థ కార్యాలయం

ఏలూరు (టూటౌన్): జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఓ మహిళా కాంట్రాక్ట్ ఉద్యోగి అన్నీతానై చక్రం తిప్పుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాసులు సమర్పించిన వారికే పోస్టింగ్‌లు ఇచ్చేలా పావులు కదుపుతున్నట్టు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా మహిళాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహతో పాటు ప్రొటెక్షన్ ఆఫీసర్ (నాన్ ఇనిస్టిట్యూషనల్ కేర్), సోషల్ వర్కర్ పోస్టులు కలిపి మొత్తం ఏడింటికి మిషన్ వాత్సల్య పథకంలో ఉద్యోగాల కోసం గత అక్టోబర్ 18న ఇంటర్వ్యూలు నిర్వహించగా సుమారు 50 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కొన్ని ఉద్యోగాలకు పోస్టింగ్‌లు ఇవ్వగా, పీఓ పోస్టుకు నియామక ఉత్తర్వులు ఇవ్వలేదు. ఒక పీఓ పోస్టుకు 17 మంది అర్హులైన అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో ఐసీడీఎస్‌లో వివిధ కేడర్లలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు కూడా ఉన్నారు. అయితే ఐసీడీఎస్‌లో పనిచేసే వారికి పోస్టింగ్ ఇస్తే తమకు సొమ్ములు రావని భావించిన సదరు ఉద్యోగి బయటవారికి కట్టబెట్టేందుకు సొమ్ముల వసూలుకు తెరతీసినట్టు తెలిసింది. ఎమ్మెల్యే సిఫార్సు లేఖలను సైతం పక్కన పెట్టారు.

మార్కులను తారుమారు చేసి..

పోస్టుల భర్తీకి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించిన కమిటీ సభ్యులు అభ్యర్థులకు మార్కులను పెన్సిల్‌తో కేటాయించారు. సదరు కాంట్రాక్ట్ ఉద్యోగి ఈ మార్కులను తారుమారు చేసి తనకు అనుకూలమైన అభ్యర్థి నుంచి ముడుపులు తీసుకుని ఎక్కువ మార్కులు వేసి నివేదికను సమర్పించినట్టు తెలిసింది. అనుభవం, అర్హతల్లో తక్కువ ఉన్న అభ్యర్థికి ఉద్యోగం కట్టబెట్టేందుకు చూస్తున్నట్టు సమాచారం. ఏళ్ల తరబడి ఇదే స్కీమ్‌లో పనిచేస్తున్న సిబ్బందిని పరిగణనలోకి తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఎన్నికల కోడ్ సాకుతో..

గతంలో ఇంటర్వ్యూలు జరిగిన తర్వాత శిశుగృహలో కొన్ని పోస్టులకు సంబంధించి పోస్టింగ్‌లు ఇచ్చారు. మరికొన్ని పోస్టులను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకుగా చూపారు. తాజాగా మరలా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రానుండటంతో దీనిని సాకుగా చూపి అయిన వారికి పోస్టులను కట్టబెట్టనున్నారని అభ్యర్థులు వాపోతున్నారు.

అవినీతి ఆరోపణలు

సదరు కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగిపై ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అయితే నామమాత్రంగా విచారణలు జరిపించి ఫిర్యాదులను క్లోజ్ చేయిస్తున్నారనే వాదనలు ఉన్నాయి. మహిళాభివృద్ధి శాఖలో ఆమె ఆగడాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

కలెక్టర్ విచారణ జరిపించాలి

మార్కులు తారుమారు, పోస్టుల భర్తీకి సంబంధించి కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఇంటర్వ్యూల్లో కమిటీ సభ్యులు అభ్యర్థులకు వేసిన మార్కులను ఫొటో తీశారని, ప్రధాన నివేదికలో మార్కులు మార్పు చేసినట్టు వారే గుర్తించినట్టు తెలిసింది. తమకు న్యాయం జరగకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అభ్యర్థులు అంటున్నారు.

సూర్య బింబం.. ప్రకృతి సోయగం



సాయం సంధ్య వేళ ఆకాశంలో సూర్యుడు కనువిందు చేశాడు. లేత ఎరుపు రంగులో కనిపించి ఆకట్టుకున్నాడు. గురువారం ఏలూరు నగరంలో కనిపించిన దృశ్యమిది.

\- సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు

క్లుప్తంగా

వర్జీనియా రైతులకు అవగాహన సదస్సు

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు రైతులకు గురువారం బయ్యన్నగూడెం, కొయ్యలగూడెం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిని గ్రేసీ మార్గరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ జీఎల్కే ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురుగు మందుల అవశేషాలు కలిగి ఉండటం వలన నాణ్యమైన పొగాకు ఉత్పత్తి ధర పతనమవుతుందని అధికారులు వివరించారు. గుంటూరు నుంచి వచ్చిన పొగాకు బోర్డు విస్తరణ అధికారి దామోదర్, సీటీఆర్ఐ సైంటిస్ట్ వి.వెంకటేశ్వర్లు పురుగు మందులు ఉపయోగించిన పొగాకుకు, సేంద్రియంగా పండించిన పొగాకుకు మధ్య వ్యత్యాసాలను ప్రదర్శిస్తూ రైతుల్లో అవగాహన కల్పించారు. కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రంలో ఎస్ఎల్ఎస్ పరిధిలో ఐదు ఆక్షన్ ప్లాట్‌ఫారాలకు సంబంధించిన రైతు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

కాపాడి.. కౌన్సెలింగ్ ఇచ్చి..

ఏలూరు టౌన్: రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు కాపాడారు. టూ టౌన్ ఎస్సై దానం తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని నాగేంద్ర కాలనీ ప్రాంతానికి చెందిన నర్ర గోపి స్థానికంగా నూనె దుకాణంలో పనిచేస్తూ భార్యతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో రూ.3 లక్షలు అప్పు చేసి సొంత వ్యాపారం ప్రారంభించాడు. వ్యాపారం సజావుగా సాగకపోవటంతో అప్పులు చెల్లించలేక గురువారం ఏలూరు టూ టౌన్ పరిధిలో రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు వెంటనే ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్ 112కు సమాచారం ఇచ్చారు. టూటౌన్ ఎస్సై దానం, కానిస్టేబుల్ సుందర్ రాజు హుటాహుటిన అక్కడకు చేరుకుని గోపిని రక్షించారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లైసెన్స్ లేని ఎరువులు సీజ్

కైకలూరు : విక్రయ లైసెన్సులు లేని రూ.29 వేల విలువ కలిగిన బయో స్టిమ్యులెంట్స్ అనే ఎరువులను కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు గురువారం సీజ్ చేశారు. వింజరం గ్రామంలో శివ నాగ దుర్గా ట్రేడర్స్ నుంచి రశీదులు లేకుండా ఎరువులు విక్రయిస్తున్నట్లు వ్యవసాయాధికారులకు సమాచారం అందింది. దీంతో మండల వ్యవసాయాధికారిణి ఆర్.దివ్యతో కలసి దుకాణాన్ని తనిఖీ చేశారు. యజమాని సుబ్రహ్మణ్యం నుంచి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. లైసెన్సులు లేని ఎరువులు దుకాణం బయట కనుగొన్నారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ శివ నాగ దుర్గా ట్రేడర్స్‌కు కేవలం పురుగు మందులు విక్రయించే లైసెన్సు మాత్రమే ఉందన్నారు. ఎరువుల విక్రయాలకు అనుమతులు లేవన్నారు. పైగా పలువురు రైతులకు ఎరువులు విక్రయించి రశీదులు ఇవ్వకుండా ఖాతా పుస్తకంలో పేర్లు నమోదు చేశాడన్నారు. దీంతో శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: గ్రామాలను ఖాళీ చేయించి భూములు ఇచ్చిన గిరిజనులకు పరిహారం ఇచ్చాకే ప్రాజెక్టు పూర్తి చేయాలని పోలవరం నిర్వాసితుల యాత్ర బృందం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రంపచోడవరం జిల్లాలో ప్రారంభమైన నిర్వాసితుల యాత్ర గురువారం జంగారెడ్డిగూడెం చేరుకుంది. స్థానిక బస్టాండ్ సెంటర్లో ఈ యాత్ర బృందానికి సీపీఎం జంగారెడ్డిగూడెం మండల, పట్టణ కమిటీలు ఘనస్వాగతం పలికాయి. అనంతరం బస్టాండ్ సెంటర్లో నిర్వాసితుల యాత్ర రాష్ట్ర నాయకులు కామ్రేడ్ దడాల సుబ్బారావు లోత రామారావు మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయల నిధులను ప్రాజెక్టు కట్టడానికి వెచ్చిస్తున్నారే తప్ప, భూమిలిచ్చి గ్రామాలు ఖాళీ చేసిన నిర్వాసితులకు గిరిజనులకు పరిహారం ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. సీపీఎం పార్టీ రాష్ట్ర 27వ మహాసభలు నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరుగుతున్నాయని, ఈ మహాసభల్లో పోలవరం నిర్వాసితుల సమస్యలపై చర్చించి తగు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ యాత్రలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రవి కిషోర్ నాగమణి, యాత్ర బృందం, మండల కార్యదర్శి ఎం జీవరత్నం పట్టణ కన్వీనర్ పి సూర్యారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కునూరుకు చేరిన యాత్ర

కుక్కునూరు: పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జీపు యాత్ర గురువారం కుక్కునూరుకు చేరింది. ఈ సందర్భంగా రామసింగారం సెంటర్లో జాతనుద్దేశించి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడారు. కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయల దోచిపెట్టేలా ప్రాజెక్టు నిర్మాణం పై ఉన్న శ్రద్ధ ప్రభుత్వాలకు నిర్వాసితులకు చెల్లించే పునరావాస పరిహారంపై లేకపోవడం సరి కాదన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం ప్రతి నిర్వాసితుడికి రూ.15 లక్షలు పునరావాస పరిహారం ఇవ్వాలని నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించే వరకు ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిపివేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి మాట్లాడుతూ 2022 గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకొని మండలం యూనిట్ గా తీసుకొని ప్రతి నిర్వాసితుడికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు వై నాగేంద్రరావు, పోలవరం మండల నాయకులు తాటి శాంతకుమారి ఎం వీరాయమ్మ, కుక్కునూరు మండల నాయకులు వై సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య పట్ల సీతమ్మ, మహబూబ్ పాషా, పి రమేష్ శ్యామల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మతంగూడెంలో దారుణహత్య

- కొడవలితో భార్యను హత్య చేసిన భర్త
- నిందితుడు పరారీ
- హత్యకు దారితీసిన అనుమానం



మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకన్న

లింగపాలెం: రక్తపు మడుగులో ఓ మహిళ మృతి చెందడం లింగపాలెం మండలం మతంగూడెంలో సంచలనం రేకెత్తించింది. గ్రామానికి చెందిన జక్కంపూడి నాగమణి (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ప్రతిరోజూ పనులకు వెళ్లే విధంగానే తోటి కూలీలు ఆమెను పనికి రమ్మని పిలవడానికి వెళ్లగా.. ఇంట్లో రక్తపు మడుగుల్లో నాగమణి పడి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. చింతలపూడి సీఐ ఎం.రవీంద్ర, ధర్మాజీగూడెం ఎస్సై కే వెంకన్న హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరిస్తున్నారు.

అనుమానమే.. పెనుభూతమై

జక్కంపూడి మారేష్, నాగమణి భార్యభర్తలు. వీరికి ఒక కుమారుడు కుమార్తె సంతానం కాగా వారిద్దరికి వివాహాలై వేరే చోట నివసిస్తున్నారు. కాగా మారేష్ మద్యానికి బానిస కావడంతో నాగమణిని ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో వీరిద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో గొడవలను సర్దుబాటు చేశారు. అయితే మారేష్ ఇటీవల మద్యం సేవించి మతిస్థిమితం లేనివాడిలా ప్రవర్తించేవాడిని స్థానికులు చెబుతున్నారు. ఇదే క్రమంలో గురువారం రాత్రి భార్య నాగమణిని కత్తితో నరికి చంపి వేసి పరారీ అయ్యాడు. చింతలపూడి సీఐ రవీంద్ర పర్యవేక్షణలో ధర్మాజీగూడెం ఎస్సై కే. వెంకన్న ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు.

3న ఆటపాకలో పక్షుల పండగ

కైకలూరు: ప్రపంచ చిత్తడి నేలలను దినోత్సవం(ఫిబ్రవరి 2)ను పురస్కరించుకుని 3వ తేదీన ఆటపాక పక్షుల విహారం కేంద్రం వద్ద ఏలూరు డివిజన్ అటవీశాఖ, వరల్డ్ వైల్డ్ ఫండ్(డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో బార్డ్ ఫెస్టివల్, చిత్రడి నేలలపై అవగాహన కల్పించనున్నారు. ఏలూరు, కైకలూరు, భీమవరం ప్రాంతాల నుంచి 6-9 తరగతి విద్యార్థులు 500 మంది హాజరుకానున్నారు. వీరికి వివిధ పోటీలను నిర్వహించి 75 బహుమతులు ప్రదానం చేయనున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి బి.వి జయ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ ఫరిదా టాంపాల్‌ల నిర్వహణలో రాజమండ్రి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు బీఎస్ఎన్.మూర్తి, ఏపీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) డాక్టర్ శాంతి ప్రియా పాండే, పీసీసీఎఫ్(పరిశోధన) ఏకే.నాయక్, పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరీ, మాజీ గ్లోబల్ పాలసీ సలహాదారుడు గుజ్జా భిక్షం, ఐబీసీఎస్ స్టేట్ కో-ఆర్డనేటర్ శ్రీరామ్‌రెడ్డి హాజరు కానున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం- జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై ఓల్డ్ ఏజ్ హోమ్ సమీపంలోని కోత మిషన్ వద్ద గురువారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్సై వి చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన సాధు భక్తవత్సల కుమార్ (63) జంగారెడ్డిగూడెం వైపు వెళుతుండగా వెనక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కుమారుడు జోసఫ్ కులకర్ణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

భారీ కోడిపందేల శిబిరంపై దాడి

- 9 మంది అరెస్ట్.. 40 బైకులు, నగదు స్వాధీనం
- పారిపోయిన నిర్వాహకులు, టీడీపీ శ్రేణులు



లోపూడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న బరి



కోడిపందేల్లో పట్టుబడిన బైకలను ట్రాక్టర్లలో తరలిస్తున్న పోలీసులు

ముసునూరు: అధికారం అండతో లోపూడిలో అర్ధ రాత్రి యథేచ్ఛగా నిర్వహిస్తున్న భారీ కోడి పందేల శిబిరంపై పోలీసులు మెరుపు దాడిచేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకోగా, వారివద్ద నుంచి రూ.42,400, 40 బైకులు, 12 కోడి పుంజులు, నాలుగు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. వివరాల ప్రకారం.. లోపూడిలోని ఓ మామిడి తోటలో బుధవారం రాత్రి అతి రహస్యంగా జరుగుతున్న కోడి పందేలపై ముసునూరు ఎస్సై చిరంజీవి, చాట్రాయి ఎస్సై రామకృష్ణ, సిబ్బందితో కలసి ముప్పేట దాడి చేశారు. గ్రామానికి చెందిన, పందేల నిర్వాహకులైన అధికార పార్టీ శ్రేణులు పారిపోగా, తొమ్మిది మందిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పోలీసుల దాడి సమయానికి తోటలో ఉన్న వందలాది జూదరులు బరి చుట్టు పక్కల ఉన్న పొగాకు, మొక్కజొన్న, మిర్చి తోటలను తొక్కుకుంటూ పారిపోవడంతో పంటలు పాడయ్యాయని సమీప రైతులు ఆవేదన చెందుతున్నారు. మరికొందరు చెక్కపల్లి వైపు పారిపోతూ ఉండగా కారు పల్టీకొట్టి అందులోని వారు గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారం అండగా అదే తోటలో సంక్రాంతి అనంతరం నిత్యం కోడి పందేలు నిర్వహిస్తూ, ఇతర జిల్లాల నుంచి కూడా పందెంరాయుళ్లను రప్పిస్తున్నట్లుగా తెలుస్తోంది. పారిపోయిన టీడీపీ శ్రేణులు నిర్వాహకులను సైతం అరెస్టు చేయాలని పలువురు కోరుతున్నారు. పట్టుబడిన వారిని శుక్రవారం కోర్టుకు తరలిస్తామని పోలీసులు చెప్పారు.

కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించాలనుకునే జిల్లాకు చెందిన భక్తుల సౌకర్యార్థం ఏలూరు డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు డిపో నుంచి ఫిబ్రవరి 4వ తేదీన ఈ బస్సులు బయలుదేరుతాయని, రిజర్వేషన్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ బస్సులు ఏలూరులో బయలుదేరి పూరి, కోణార్క్, భువనేశ్వర్, ప్రయాగ రాజ్ సంగమ స్థానం, కాశీ, అయోధ్య, గయా, బుద్ధగయ, తిరుగు ప్రయాణంలో ఆంధ్ర రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన అరసవెల్లి సూర్య దేవాలయం, శ్రీకూర్మం దర్శనం అనంతరం ఏలూరు చేరుకుంటుందన్నారు. మొత్తం ఎనిమిది రోజులు జరిగే ఈ యాత్రలో రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణికులకు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ యాత్ర మొత్తం ఖర్చు రు.12500గా నిర్ణయించామన్నారు. వివరాలకు తమ పీఆర్‌ఓను 93467 67670లో సంప్రదించవచ్చన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏలూరుకి సమీపంలోని బలివే పుణ్య క్షేత్రానికి ఏలూరు, నూజివీడు డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, పట్టిసీమకి జంగారెడ్డిగూడెం నుంచి 30 బస్సులు, తాడేపల్లిగూడెం నుంచి 20 బస్సులు, తాడేపల్లిగూడెం వద్ద ఉన్న వీరంపాలెంకు తాడేపల్లిగూడెం నుంచి 10 బస్సులు, ఏలూరు నుంచి 4 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఫిబ్రవరి 7, 8 తేదీల్లో జరిగే అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవానికి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 50 బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటీవల సంక్రాంతి పండగ సందర్భంగా హైదరాబాద్‌కి 572 స్పెషల్ బస్సులు తిప్పామని, వాటిద్వారా రూ.1.14 కోట్ల ఆదాయం జిల్లా ఆర్టీసీకి వచ్చిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ.పది లక్షలు ఎక్కువ ఆదాయం వచ్చిందని ఆర్టీసీ బస్సులు ఎంచుకొని ప్రయాణించిన ప్రతి ప్రయాణికుడికి ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో ఏలూరు డిపో మేనేజర్ బీ వాణి, ఏఎంటీ జీ మురళి, పీఆర్వో కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు.

కొల్లేరులో మిగులు భూములను పేదలకు పంచాలి



మాట్లాడుతున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్) : కొల్లేరులో మిగులు భూములను స్థానిక పేదలకు పంపిణీ చేయాలని ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్ఆర్ పేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాయలంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజాగా సుప్రీంకోర్టు కొల్లేరులోని స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి ఎటువంటి భంగం కలుగకుండా ఆక్రమణలు మూడు నెలల్లో తొలగించాలంటూ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం ఎటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టకుండా అక్రమ చెరువులను ధ్వంసం చేస్తామంటూ ప్రకటనలు చేయడం వల్ల కొల్లేరు ప్రజల్లో అయోమయం నెలకొందన్నారు. సుప్రీంకోర్టు విధి విధానాల ప్రకారం కొల్లేరు ప్రజలకు అవగాహన కల్పించి అనంతరం ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఇదే క్రమంలో కొల్లేరులో మిగులు భూములను స్థానిక ఎస్సీ, బీసీలకు పంపిణీ చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాము మాన్‌సింగ్, దాసరి శ్యాం, బొల్లారపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైటర్ పాత్ర ఎంతో కీలకం

ఎస్పీ కె ప్రతాప్ శివకిషోర్



పెదవేగి : పోలీస్ స్టేషన్‌లో రైటర్ పాత్ర ఎంతో కీలకమని ఎస్పీ కె ప్రతాప్ శివకిషోర్ అన్నారు. పెదవేగి జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో 36 మంది స్టేషన్ రైటర్‌లకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ట్రైనింగ్ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా త్వరితగతిన కేసులు పరిష్కరించవచ్చునని, ఆ దిశగా పోలీస్ సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. కేసుల విచారణలో సీసీ టీవీల ప్రాధాన్యత, వాటి వినియోగం, ఫిర్యాదుదారులతో మెసలుకునే విధానంపై వివరించారు. అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు మాట్లాడుతూ రైటర్‌లకి ఆధునిక విధానాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా మెరుగైన రీతిలో విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ట్రైనింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఎస్పీ చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. డీటీసీ డీఎస్పీ ప్రసాద్, సీఐ రామారావు, పెదవేగి ఎస్సై రామకృష్ణ, ఎస్సైలు శానం శ్రీనివాసరావు, విజయ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నా భర్తను కుటుంబ సభ్యులే హత్య చేశారు

కలెక్టర్, ఎస్పీలకు భాదితురాలి ఫిర్యాదు



కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన యడ్ల మధుమిత

దెందులూరు: తన భర్తను వారి కుటుంబ సభ్యులే హత్య చేశారని దెందులూరు మండలం చల్లపల్లి గ్రామానికి చెందిన యడ్ల తంబి బాబు భార్య మధుమిత ఆరోపించింది. తంబి బాబు మృతదేహానికి పోస్టుమార్టం చేస్తే నిజాలు తెలుస్తాయని కోరుతూ కలెక్టర్, ఎస్పీలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. మాకు ఆశ్రిత్ హర్షిత ఇద్దరు పిల్లలు ఉన్నారని, అత్తమామలు తరచు నా భర్తను కొట్టడం, తిట్టడం వల్ల మేము అలుగులగూడెంలో మా అమ్మ ఇంటి వద్దనే ఉండేవాళ్లమని మధుమిత పేర్కొంది. మా ఇంటి వద్ద నుంచి భర్త తంబి బాబు జూన్ 10వ తేదీన ఉదయం డ్యూటీ నిమిత్తం వెళ్లారని, సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదని చెప్పింది. 16వ తేదీన మహిళా పోలీసు కొండపల్లి ప్రశాంతి ఫోన్ చేసి మీ ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందించారని తెలిపింది. మా అత్తమామలు పెట్టే బాధలకు మానసికంగా శారీరకంగా కృంగిపోయి, మందుకు బానిస అయ్యాడని, ఈ క్రమంలోనే అదునుచూసుకుని వాళ్లే ఆయన్ను చంపేసి ఉరివేసుకున్నాడని చెబుతున్నారని ఆరోపించింది. తంబి బాబు మృతదేహానికి పోస్టుమార్టం చేసి హత్యకు కారకులైన వారిని గుర్తించి కఠినంగా చర్యలు తీసుకోవాలని మధుమిత కలెక్టర్, ఎస్పీలను కోరింది.


గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ కె. వెట్రిసెల్వి



ఏలూరు (మెట్రో): గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదర్శ ఐటీడీఏగా కేఆర్‌పురం ఐటీడీఏను నిలిపే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో సమష్టి కృషి చేయాలన్నారు. ఐటీడీఏ పరిధిలో విద్యుత్ సౌకర్యం లేని ఏఒక్క గిరిజన గ్రామం ఉండకూడదన్నారు. గిరిజన ప్రాంతంలో రోడ్డు కనెక్టవిటి, టెలిఫోన్ కనెక్టవిటీ, అంతర్గత రహదారులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను వేగవంతంగా అభివృద్ధి పర్చాలన్నారు. సమావేశంలో పీసా గ్రామ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. అలాగే గిరిజన ప్రాంతంలోని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలన్నారు. పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. మాతా శిశు మరణాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులకు సురక్షిత ప్రసవాలు జరిగేందుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఇందుకోసం ముందస్తుగా వారిని గుర్తించి సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. శిశువులకు నూరుశాతం వ్యాక్సినేషన్ నిర్వహించాలన్నారు. మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్ ఫాక్స్, వంటి వ్యాధుల నిర్మూలనపై చేపట్టిన చర్యలపై సమీక్షించారు. అలాగే గిరిజన ప్రాంతంలో మౌలిక సదుపాయాలతో పాటు ఇళ్లకు సంబంధించిన ప్రగతిని చూపించి త్వరితగతిన నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో వీటీజీఎస్ ద్వారా అడ్డాకుల తయారీ, వేరుశెనగ, జీడిపప్పు, చాక్‌లెట్ తయారీ తదితర అంశాలపై ప్రోత్సహించాలన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ఏపీవో పీవీఎస్ నాయుడు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ లత, ట్రైబల్ వెల్ఫేర్ ఎస్డీసీ ఐ.కిషోర్, పంచాయతీరాజ్ ఈఈ కె.శ్రీను, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.సురేష్, ఐసీడీఎస్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏలూరు మార్కెట్‌లోకి హీరో కొత్త స్కూటర్



హీరో డెస్టినీ స్కూటర్‌ను ఏలూరు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఏఎస్పీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హీరో మోటోకార్ప్ కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన డెస్టినీ 125 స్కూటర్‌ను అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు గురువారం రాత్రి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని సాయి స్వర్ణ హీరో షోరూంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మూడు రకాల వేరియంట్లు వీఎక్స్, జెడ్ ఎక్స్, జెడ్ ఎక్స్ ప్లస్‌లతో ఇది అందుబాటులో ఉందని కంపెనీ ప్రొడక్ట్ స్ట్రాటజీ ఏజీఎం ఎన్‌వీవీ అర్జున్ తెలిపారు. ఏలూరు షోరూమ్‌లో ఈ వాహనాలను టెస్ట్ రైడ్ చేసి స్కూటర్‌ను బుక్ చేసుకోవాలని సూచించారు. ప్రప్రథమంగా కొనుగోలు చేసిన వాహనదారులకు స్కూటర్ తాళాన్ని, హెల్మెట్‌ను ముఖ్య అతిథులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం కిరీటి, ఏపీఎం గణేష్, షోరూం జీఎం ఏవీ సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ శ్యాం కుమార్

దెందులూరు: గోపన్నపాలెం పంచాయతీ వేగవరం హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ ఆవరణలో గురువారం జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో అంతర్ కళాశాల హ్యాండ్‌బాల్ బాలికల - బాలుర విభాగాల్లో టోర్నమెంట్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జేఎన్‌టీయూ కాకినాడ డాక్టర్ జి శ్యాం కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి మౌలిక వస్తువుల కల్పనకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఉమ్మడి జిల్లాలైన తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల నుంచి బాలుర విభాగంలో 11 జట్లు, బాలికల విభాగానికి సుమారుగా 10 జట్లు ఎంపిక ట్రైల్స్‌లో పాల్గొన్నారు. ఈ పోటీలు శుక్రవారం కూడా కొనసాగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లావణ్య, ఏఓ కరుణానిధి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియేలు, డీఎస్‌డీఓ బీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు

మొదటి మ్యాచ్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలికల విభాగంలో గుంటూరు జిల్లా సెయింట్ మేరీస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ వర్సెస్ సర్ సీఆర్ రెడ్డి ఏలూరు, బాలుర భాగంలో వీఆర్ సిద్ధార్థ వర్సెస్ మాచర్ల న్యూటన్స్ కాలేజీ తలపడ్డాయి. బాలుర విభాగంలో గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీసీ వర్సెస్ వీవీసీ సిద్ధార్థ టీమ్ తలపడ్డాయి. బాలుర విభాగంలో రామచంద్ర కాలేజ్ వర్సెస్ జేఎన్‌టీయూ కాకినాడ జట్టు, బాలుర విభాగంలో పీఎస్ సీఎంఆర్ కాలేజ్ వర్సెస్ ఒంగోలు పేస్ కాలేజ్ జట్లు మొదటి రోజు ఉత్సాహంగా తలపడ్డాయి.

అపుస్మా క్రీడల జిల్లా చాంపియన్ చింతలపూడి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అపుస్మా ఏలూరు జిల్లా ఇంటర్ జోనల్ బాలబాలికల క్రీడాపోటీలు స్థానిక ఏఎస్ఆర్ స్టేడియంలో మూడవరోజు ఉత్సాహంగా జరిగాయి. గురువారం అన్ని కేటగిరిల్లో బాలికల గేమ్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ జోన్ల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని గేమ్స్ కన్వీనర్ జేఎం జేవీయార్, అపుస్మా జిల్లా ప్రెసిడెంట్ ఎం. శివకుమార్ శర్మ, సెక్రటరీ ఎస్ఆర్‌కేఏ ప్రసాద్ అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి చేతులమీదుగా అందజేశారు. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను చింతలపూడి జోన్ కైవశం చేసుకుంది. కాగా ద్వితీయ స్థానంలో ఏలూరు జోన్ క్రీడాకారులు నిలిచారు. అపుస్మా రాష్ట్ర కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, జోనల్ అధ్యక్షుడు ఓ.బుల్లబ్బాయి, జిల్లా కోశాధికారి రామకృష్ణ, ఏలూరు జోన్ అధ్యక్షుడు కే.వెంకటేశ్వరరావు, బీ.రాంబాబు, కే.రాజ్‌కుమార్, సీహెచ్ రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.